# బీఆర్ఎస్‌లో చేరికల జోష్

- జోరుగా కొనసాగుతున్న వలసలు
- కాంగ్రెస్, బీజేపీలను వీడి గులాబీ కండువాలు కప్పుకుంటున్న నాయకులు, కార్యకర్తలు
- అభివృద్ధి పనులను చూసి ఆశీర్వదిస్తే.. నియోజకవర్గాల్లో మరింత డెవలప్ చేస్తామని హామీ ఇస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..

**కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కుదురుమల్ల కాంగ్రెస్ కార్యకర్తలు

బొంరాస్‌పేట, నవంబర్ 6 : కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరికల జోరు కొనసాగుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్షాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం దుద్యాల మండలంలోని కుదురుమల్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో గ్రామానికి చెందిన ప్యాలమద్ది రాములు, బస్వరాజ్, రవి, నాగేశ్, నర్సప్ప, నర్సింహులు, బజారప్ప, అశోక్, అనంతి, జూలపల్లి రాములు, వెంకటప్ప, మహేశ్, శ్రీశైలం, నారాయణ, ప్రకాశ్, వెంకటమ్మతో పాటు 80 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ దుద్యాల మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, యూత్ నాయకుడు శ్రీనివాస్, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష

**ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి**


కాంగ్రెస్ నాయకులకు పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, నవంబర్ 6 : సీఎం కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగిలో సోమవారం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గండీడ్ మండలం ఆసిరెడ్డిపల్లికి చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ చెవుల చంద్రయ్య, సీనియర్ నాయకులు చెవుల వెంకటయ్య, చంద్రయ్యతోపాటు వారి అనుచరులు, పరిగిలోని 11వ వార్డులో 25 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలకు మేలు చేకూరిందని, మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కానున్నదన్నారు. బీఆర్ఎస్ గెలుపు సాధించనుండడంతో ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆయన తెలిపారు.

## ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నామినేషన్ దాఖలు

**సెంటిమెంట్‌గా మొదటి సెట్‌ను రిటర్నింగ్ అధికారికి అందజేసిన ఆయన సతీమణి**



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న ఆయన సతీమణి ముకుందమ్మ

ఇబ్రహీంపట్నం, నవంబర్ 6 : ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నామినేషన్ మొదటిసెట్‌ను ఆయన సతీమణి ముకుందమ్మ సోమవారం ఉదయం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఆయన సతీమణి ముకుందమ్మ, కూతురు శీతల్‌తో కలిసివచ్చి నామినేషన్ పత్రాలు అందజేశారు. సెంటిమెంట్‌గా మొదటిసెట్‌ను ప్రతిసారీ ఆయన సతీమణి వేయడం ఆనవాయితీగా వస్తున్నది. అందులో భాగంగానే మొదటి నామినేషన్ సెట్‌ను అందజేశారు. ఈనెల 9న భారీ ర్యాలీతో కిషన్‌రెడ్డి మరో నామినేషన్ సెట్‌ను దాఖలు చేయనున్నారు.

## తిరుగులేని శక్తిగా భారత రాష్ట్ర సమితి

**ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

ఇబ్రహీంపట్నంరూరల్/పెద్దఅంబర్‌పేట, నవంబర్ 6 : నియోజకవర్గంలో బీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా మారిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ అన్నా రు. సోమవారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పసుమాముల గ్రామానికి చెందిన బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ముసరిగారి రాజూగౌడ్‌తో పాటు మరో 30మంది అనుచరులు బీఆర్ఎస్ లో చేరారు. మంచాల మండలం దాద్‌పల్లి గ్రామానికి చెందిన వంద మంది సీపీఎం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గులాబీ కండువాలు కప్పుకున్నారు. పటేల్‌చెర్వుతండాకు చెందిన వంద మం ది సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 2వ వార్డుకు చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు 50మంది, మండలంలోని నాగన్‌పల్లి, దండుమైలారం గ్రామాలకు చెందిన 200మంది గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు వీరికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.


ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రాజూగౌడ్ తదితరులు


మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి సుధాకర్‌రెడ్డి

## గులాబీ గూటికి వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు

షాద్‌నగర్, నవంబర్ 6 : వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు, పీసీసీ మాజీ ప్రచార కార్యదర్శి బొబ్బిలి సుధాకర్‌రెడ్డి మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరినట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్ గెలుపునకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

## మూడో రోజు 30 నామినేషన్లు దాఖలు

**రంగారెడ్డి జిల్లాలో 18, వికారాబాద్ జిల్లాలో 12 నామినేషన్లు**

**శాసనసభ ఎన్నికల కోసం ఆయా నియోజక వర్గాల్లో అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మూడో రోజు 30 మంది నామినేషన్లను దాఖలు చేశారు. వీటిలో రంగారెడ్డి జిల్లాలో 18 మంది, వికారాబాద్ జిల్లాలో 12 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. వికారాబాద్ జిల్లాలో ఇప్పటివరకు మొత్తం18 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నామినేషన్లు వేసేందుకు ఇంకా మూడు రోజులే గడువు ఉన్నది. శుభ ముహూర్తం చూసి అభ్యర్థులు నామినేషన్లు వేయనున్నారు.**

### ఇప్పటివరకు నాలుగు స్థానాలకు 18 నామినేషన్లు

వికారాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు మరో మూడు రోజులే గడువు ఉన్నది. ఈనెల 8, 9 తేదీల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గ స్థానాలకు మూడు రోజుల్లో 18 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. అత్యధికంగా తాండూరు నియోజకవర్గ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు, కొడంగల్ నియోజకవర్గ స్థానానికి ఐదు గురు, వికారాబాద్ నియోజకవర్గ స్థానానికి ముగ్గురు, పరిగి నియోజకవర్గ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం జిల్లాలోని నాలుగు స్థానాలకు 12 మంది నామినేషన్లు దాఖలు చేయగా, కొడంగల్ నియోజకవర్గ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి అనుముల రేవంత్ రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి కాకులారం శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థిగా గొట్టిముక్కుల అంజిలయ్య నామినేషన్ దాఖలు చేశారు. తాండూరు నియోజకవర్గ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా మహ్మద్ ముస్తాఫా, బి.రాములు, గోపాల్ నామినేషన్లు దాఖలు చేయగా, బీఎస్పీ నుంచి బోయిని చంద్రశేఖర్, ధర్మసమాజ్ పార్టీ నుంచి రిజ్వానా నామినేషన్ దాఖలు చేశారు. వికారాబాద్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా బీజేపీకి చెందిన ఎర్రోళ్ల లక్ష్మయ్య నామినేషన్ దాఖలు చేయగా, పరిగి నుంచి తెలంగాణ రాజ్యసమితి నుంచి లాలయ్య, స్వతంత్ర అభ్యర్థిగా బూనేటి కిరణ్ నామినేషన్ దాఖలు చేశారు.

**ఇబ్రహీంపట్నం :** రంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న శాసనసభ ఎన్నికల కోసం వివిధ నియోజకవర్గాల్లో సోమవారం 18నామి నేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. నామినే షన్లు దాఖలు చేసిన వారిలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి మంచిరెడ్డి కిషన్ రెడ్డి (బీఆర్ఎస్), ముద్దగోని రాజేశ్ (స్వతంత్ర), దండెం రాంరెడ్డి (స్వతంత్ర), తులసీగారి రవీందర్ (డీఎస్పీ), ఎల్‌బీనగర్ నియోజక వర్గం నుంచి నల్లమడుగు శోభారాణి (స్వతంత్ర), పటిబాల అంజి (స్వతంత్ర), పెండ్యాల వినోద్ కుమార్ (స్వతంత్ర), చామకూర రాజయ్య (సోషల్ జస్టిస్ పార్టీ), రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బూరమోని రాములు (ఆలిండియా ఫార్వడ్‌బ్లాక్), మహ్మద్ ఇక్బాల్ (స్వతంత్ర), శేరిలింగంపల్లి సయ్యద్ సాబెర్ (స్వతంత్ర), గంజి వాసు (స్వతంత్ర), తుడం అనిల్ కుమార్ (మార్కిస్టు కమ్యూనిస్టు పార్టీ ఇండియా), జువ్వ ఫణికుమార్ (స్వతంత్ర), దుర్గాప్రసాద్ (స్వతంత్ర), కల్వకుర్తి నుంచి కసిరెడ్డి నారాయ ణరెడ్డి (కాంగ్రెస్), మల్లపల్లి హనుమాన్‌దాస్ (స్వతంత్ర), తుగ్గలి ఆంజనేయులు (స్వతంత్ర) నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరి తెలిపారు.

## పకడ్బందీగా వాహనాల తనిఖీలు

**ఎస్పీ కోటిరెడ్డి**



వికారాబాద్, నవంబర్ 6 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీలలో నగదు తరలించే సమయంలో సరైన పత్రాలు చూయించని వారిపై కేసులు నమోదు చేసి నగదు సీజ్ చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 111 కేసులు నమోదు చేసి, రూ.2,14,14,001 నగదు సీజ్ చేశామని తెలిపారు. అలాగే సరైన ఆధారాలు లేకుండా త రలిస్తున్న 45 తులాల బంగారు ఆభరణాలు, 42 సెల్ ఫోన్స్, 45 టీ ప్లాస్కులు, 708 పర్ఫ్యూమ్ బాటిళ్లకు సంబంధించి కేసులు నమోదు చేసి సీజ్ చేశామన్నారు.

## అనంతగిరి అడవిలోకి చిరుత?

వికారాబాద్, నవంబర్ 6 : అనంతగిరి అడవిలో చిరుత పులి కనిపించిందని గోధుమగూడ గ్రామస్తులు తెలిపారు. దీంతో అటవీ ప్రాంతంలో పలుచోట్ల సీసీ కెమెరాలను ఆ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి అనంతగిరిలోకి చిరుతపులి వెళ్లడాన్ని అనంతగిరి గుట్ట కింద ఉన్న గోధుమగూడ గ్రామస్తులు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. చిరుతపులి ఆనవాళ్లు తెలుసుకోవడానికి అనంతగిరి అటవీ ప్రాంతంలో 4 సీసీ కెమెరాలను అటవీ శాఖ అధికారులు సోమవారం ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలకు చిక్కితే అసలు చిరుతపులి ఉందో లేదో తెలుస్తుందని వారు తెలిపారు. అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.